

17న వికాస కార్యాలయంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

వికాస కార్యాలయంలో 17న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చారావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో గాంధీ సర్జికల్స్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, అకౌంటెంట్, ఎలక్ట్రీషియన్, క్యాషియర్ అండ్ హెల్పర్, బజాజ్ కాపిటల్‌లో టెలికాలర్, ఫైనాన్సియల్ అడ్వైజర్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్, శ్రీ సత్య మారుతీ హాస్పిటల్స్ ఫీమేల్ కో ఆర్డినేటర్స్, ఫిమేల్ రిసెప్షనిస్ట్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్స్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, శాంపిల్ కలెక్షన్, నీట్ (ఐసిఐసిఐ) బ్యాంక్‌లో రిలేషన్ షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, డిక్సాస్, ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. డిడి యు.జి.కె.వై స్కిల్ డెవలప్ మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉదోగ్యం కల్పించనున్నారన్నారు.

ఊపందుకోని ఖరీఫ్ సాగు

- జిల్లాలో సాగు లక్ష్యం 2.30 లక్షల ఎకరాలు
- 5 శాతమే వరి నాట్లు
- అరకొరగానే సాగునీటి సరఫరా



పెద్దాపురం మండలం నరసింగపురంలో ఖాళీగా పంట పొలాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జూన్ 1 నుంచే కాలువలకు ముందస్తుగానే సాగునీటిని విడుదల చేశామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో కాకినాడ జిల్లాలో ఖరీఫ్ పనులు నత్తనడకనే సాగుతున్నాయి. అరకొరగానే నాట్లు పడ్డాయి. ఇప్పటి వరకూ 70 శాతం నాట్లు పూర్తి కావాల్సి ఉన్నా శుక్రవారం నాటికి కేవలం 5.13 శాతం మాత్రమే సాగు పనులు జరిగాయి. సాగునీటి సరఫరాలో పర్యవేక్షణ లోపం, కాలువల్లో పేరుకుపోయిన పూడిక, ఆధునీకరణ పనులు చేపట్టకపోవడం వంటి అనేక కారణాల వల్ల సాగునీరు పలు ప్రాంతాలకు అందని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఖరీఫ్ సాగు మందకొడిగా సాగుతోంది. దీంతో వచ్చే ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో రానున్న తుపానులు, వరదల వలన రైతులకు భారీ నష్టం తప్పే పరిస్థితి కనిపించడం లేదు.

పూర్తిస్థాయిలో సాగు నీరందడం లేదు

నాలుగెకరాల్లో ఈ సారి వరి సాగు చేస్తున్నాను. కాలువల్లో పూడిక పేరుకుపోయి ఉన్నందున సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదు. మాకు కావాల్సిన వరి విత్తనాలు ఆర్బికెల్లో అందుబాటులో కూడా లేవు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి ఐదేసే నారుమడులు వేశాను. ప్రభుత్వం కనీసం గుర్రపు డెక్కనైనా తొలగించే పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలి.

- పి.శ్రీనివాస్, రైతు, సామర్లకోట

అంచనాలు తారుమారు

ఈ నెల 15 నుంచి 20 వ తేదీ వరకు వెదజల్లు సాగు చేసుకోవాలని, నాట్లు వేయడాన్ని పూర్తి చేయాలని, అక్టోబరు 31 నాటికల్లా కోతలు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే అధికారులు అంచనా వేసిన లక్ష్యానికి సుదూరంగా వాస్తవ పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 2.30 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగు జరుగనుందని అధికారులు అంచనా వేశారు. ఇది కాకుండా పత్తి 10,237 ఎకరాలు, చెరకు 9,387 ఎకరాలు, మినుములు 2,811, మొక్కజొన్న 595, కందులు 382, నువ్వులు 230, వేరుశెనగ 17 ఎకరాల్లో సాగవుతుందని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో వరిని తీసుకుంటే ఇప్పటి వరకు 52 వేల ఎకరాలకు సరిపడా సుమారు 3 వేల ఎకరాల్లో మాత్రమే ఇప్పటి వరకు అంటే 22.60 శాతం నారు మడులు సిద్ధం చేశారు.సాగునీరు రాకపోవడంతో దీనిలో భాగంగా ఇప్పటి వరకు కేవలం 41 వేల ఎకరాల్లో మాత్రమే దమ్ములు పూర్తి అయ్యాయి. 7,535 ఎకరాల్లో ఎదజల్లు సాగు, 4,252 ఎకరాల్లో ఉడ్పులు పూర్తి చేశారు. మొత్తంగా రెండు పద్ధతుల్లో నేటి వరకూ 11,807 పంట వేశారు.

పేరుకుపోయిన పూడిక

గత నెల 1న కాలువల ద్వారా విడుదల చేసినా నేటికీ రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో వారి పాలిట శాపంగా మారింది. పూడిక పనులు ప్రభుత్వం సక్రమంగా చేపట్టకపోవడంతో సాగు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. పుష్కలమైన సాగునీరు అందుబాటులో ఉన్నా గుర్రపు డెక్క, తూటి కాడ పేరుకుపోయి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. ఇదే విషయాన్ని శుక్రవారం జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తీరుపై ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాలు అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ధవళేశ్వరం నుంచి సామర్లకోట వరకు ఈస్టర్న్ డెల్టా పరిధిలో దాదాపు 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ప్రధాన కాలువతో పాటు అనుబంధంగా ఉన్న పిల్ల కాలువలు ఈ ఏడాది పూర్తిస్థాయిలో మరమ్మతులకు నోచుకోలేదు. మరోవైపు ఏలేరు, పిబిసి ప్రధాన కాలువలతో పాటు పిల్ల కాలువల్లోనూ పూడికతీత పనులు ముందుకు సాగలేదు. దీంతో సాగునీరు లభ్యత నామమాత్రంగానే ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రైతుల సమస్యలపై అధికారుల నిలదీత

తూతూ మంత్రంగానే జెడ్‌పి సమావేశం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ జెడ్‌పి కార్యాలయ సమావేశ హాలులో శుక్రవారం జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో రైతుల సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. జెడ్‌పి సమావేశం అని పెట్టి రైతుల సమస్యలపై శ్రద్ధ చూపడం లేదని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఉమ్మడి జిల్లా అని చెప్పి కేవలం కాకినాడ జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని మాత్రమే నివేదికలో పొందుపర్చారన్నారు. కౌలు రైతులకు ఇచ్చే గుర్తింపు కార్డుల లెక్కల వివరాలు కూడా సమగ్రంగా ఇవ్వలేదన్నారు. జూన్ ఒకటనే కాలువల ద్వారా నీటిని విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నా నేటికీ అనేక చోట్ల నారుమళ్లు కూడా సిద్ధం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. గతేడాది కూడా ఇదే మాట చెప్పినప్పటికీ సకాలంలో నీటి విడుదల లేకపోవడంతో అపరాల సాగు జరగలేదన్నారు. సమావేశాల్లో అధికారులు చెబుతున్న అంశాలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేదన్నారు. చిరుధాన్యాల సాగుపై మాటల్లో తప్ప ఆచరణలో శ్రద్ధ కనబరచడం లేదన్నారు. ఈ సందర్భంగా 31 అంశాలను పొందుపరచగా వ్యవసాయ, ఇరిగేషన్, వైద్య, ఆరోగ్య, గృహ నిర్మాణ సంస్థ, ఆర్ అండ్ బి, విద్యా, ఉపాది హామీ తదితర 8 అంశాలను మాత్రమే సమావేశంలో చర్చించి మమ అనిపించారు. పిఆర్ ఇంజనీరింగ్ శాఖపై మొక్కుబడిగా కానిచ్చారు. విద్యుత్ శాఖపై చర్చ సందర్భంగా పలువురు సభ్యులు అప్రకటిత కరెంటు కోతలపై ధ్వజమెత్తారు. అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

కౌలు రైతుల చట్టం ప్రకారం భూ యజమాని సంతకం ఉంటేనే సిసిఆర్ కార్డు జారీ చేస్తుండడం వల్ల వాస్తవ సాగుదారుడికి తీవ్ర నష్టం జరుగుతుందని, పలువురు రైతులు అప్పుల పాలవుతున్నారని సమావేశంలో కొందరు జెడ్‌పిటిసి ఆవేదన వ్యక్తం చేశారు. తారతమ్యం లేకుండా పూర్తిస్థాయిలో అందరికీ సిసిఆర్ కార్డులు జారీ చేయాలని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటి బాబు కోరారు. వాస్తవ సాగుదారుడికి ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో విఆర్వో, వ్యవసాయ శాఖ అధికారుల సంతకాలతో ఐదేళ్లు కౌలుకు సాగు చేస్తున్న రైతులకు డిసిసిబి ద్వారా రుణాలు ఇచ్చే ప్రక్రియను కొత్తపేట నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు కొత్తపేట ఎంఎల్‌ఎ ప్రభుత్వ చీఫ్ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ కాలువల మరమ్మతులు చేపట్టాలన్నారు. కాలువలకు నీరు విడుదల చేసినా శివారు ప్రాంతాలకు అందడం లేదని అయినవిల్లి, రాజోలు, గండేపల్లి, రాజవొమ్మంగి, కె.గంగవరం, సామర్లకోట తదితర ప్రాంతాలకు చెందిన జెడ్పిటిసిలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

వాలంటీర్లకు భరోసా కల్పిస్తూ తీర్మానం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తెచ్చిన విప్లవాత్మక వ్యవస్థ వాలంటీర్లపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ వారికి పూర్తిభరోసా కల్పిస్తున్నట్లు బిసి సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. వాలంటీర్లకు మేమున్నామంటూ భరోసా కల్పించేలా, ఈ వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపేలా తీర్మానం చేయాలంటూ ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు కోరారు. దీనిపై అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు కాకినాడ కలెక్టర్ కృతికా శుక్లా, అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత, కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు, జెడ్‌పి వైస్ చైర్మన్ బుర్ర అనుబాబు పాల్గొని మాట్లాడారు.

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజాశక్తి దినపత్రిక నిజాన్ని నిర్భయంగా రాయడంలో ముందుంటుందని ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ముమ్మిడివరం అనాతవరం సెంటర్లో గ్రాండ్ పార్క్ కళ్యాణ మండపంలో పుట్టినరోజు వేడుకల్లో ప్రజాశక్తి సంచికను ఆయన ప్రత్యేకంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సమన్వయ కమిటీ కన్వీనర్ పావనమూర్తి, జర్నలిస్టులు జి.మల్లేశ్వరరావు, శ్రీనివాస్, కుమార్, సురేష్, దుర్గబాబు



ప్రజాశక్తి సంచికను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ పొన్నాడ

ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై ట్యాక్స్ తగ్గించాలి

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్ పోర్ట్ వాహనాలపై భారీగా విధిస్తున్న రోడ్ ట్యాక్స్‌ను తగ్గించాలని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కాకినాడ టాటా మ్యాజిక్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయమైన పి.లక్ష్మీదాస్ భవన్‌లో యూనియన్ వార్షిక జనరల్ బాడీ సమావేశం వాలిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ కార్యదర్శి పి.రాజా రమేష్ గత కార్యక్రమాల నివేదికను, కోశాధికారి కె. సత్తిబాబు జమాఖర్చుల నివేదిక ప్రవేశ పెట్టగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, జిల్లా కోశాధికారి మలక వెంకట రమణ మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా వాలిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శిగా పి.రాజా రమేష్, కోశాధికారిగా కె.సత్తిబాబు, ఉపాధ్యక్షునిగా కర్రి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాఘవ, కృష్ణ, బద్రి, వీరు, రెడ్డి, సురేష్, రామకృష్ణ, రాంబాబు, హేమకుమార్, ఆంజనేయులు, రమణ, అర్జున్, శేఖర్, శేషు, సత్తిబాబు, రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

విజెస్ఎంఆర్ ఒడిగోస్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి కాకినాడ

స్థానిక రమణయ్యపేటలో విజెస్ఎంఆర్ ఒడిగోస్ టెక్నాలజీస్ ప్రారంభ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒడిగోస్ మేనేజింగ్ పార్టనర్ వార వినోద్ అధ్యక్షత వహించగా సివైఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు కాకినాడ ఆఫీసును ప్రారంభించారు. వైసిపి నాయకులు జంగా గగారిన్, మచ్చ బుజ్జి, పోస్టల్ నాయకులు వార సత్యనారాయణ ఒడిగోస్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భముగా ఒడిగోస్ మేనేజింగ్ పార్టనర్ వార వినోద్ మాట్లాడారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు అర్హత తగిన ఉద్యోగ అవకాశాలు లేక చాలా బాధపడుతున్నారని ఆలాంటి వారికి అర్హతకి అనుగుణంగా సాఫ్ట్వేర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి సాఫ్ట్వేర్ కంపెనీస్‌లో ఉద్యోగాలు పొందేలా మార్గం చూపిస్తామన్నారు. సివైఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిమ్ విల్సన్, పాస్టర్ జాషువా గిరి, ట్రస్ట్ శ్రీనివాస్, మేరీ జ్యోతి, చిన్న బాబు, ప్రవీణ్, సుభాష్, విద్యార్థులు, తలిదండ్రులు పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నేడు పిఆర్ కళాశాలలో నానో టెక్నాలజీపై సెమినార్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడలోని పిఆర్ ప్రభుత్వ కళాశాలలో నానో టెక్నాలజీ, బయో మెడికల్ అప్లికేషన్స్‌పై శనివారం జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బివి.తిరుపణ్యం తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నోవెల్ మెటీరియల్స్, నానో టెక్నాలజీ, బయో మెడికల్ అప్లికేషన్స్‌పై ఈ సెమినార్ నిర్వహిస్తామన్నారు. ఈ సెమినార్‌కు సుమారు 500 మంది వరకు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో కెమిస్ట్రీ హెచ్ఒడి డాక్టర్ డి.చెన్నారావు, ఫిజిక్స్ హెచ్ఒడి యు.కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఆదిత్య ప్రొఫెసర్ వెంకటేశ్వర్లుకు డాక్టరేట్

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్లు యుపిలోని మొనాడ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. డాక్టర్ సచిన్ సక్సేనా నేతృత్వంలో వెంకటేశ్వర్లు సమర్పించిన 'ఎ ఫైప్ లైన్ అండ్ పారలెల్ ప్రోసెసింగ్ మెథడాలజీ ఫర్ ఎఫెక్టివ్ రిమోట్ సెన్సింగ్ ఇమేజెస్' అనే అంశంపై థిసిస్ సమర్పించినందుకు ఈ డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషా రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్, డీన్ పిఎస్‌విఎస్.రవి కుమార్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ రామకృష్ణ అభినందనలు తెలిపారు.

ప్రజలకు సమగ్రంగా సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-కాకినాడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న ఆరోగ్య, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు సమగ్రంగా అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కాకినాడ ఎంపీ వంగా గీత కోరారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కాకినాడ జిల్లా అభివద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ వంగా గీత అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు, జిల్లాలో అమలు జరుగుతున్న తీరు, ప్రగతిని కమిటీ సమీక్షించింది. తొలుత చేపట్టిన వైద్య, ఆరోగ్య రంగ సమీక్షలో ఎంపీ గీత మాట్లాడుతూ ప్రజలందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు, సురక్షిత మాతృత్వం, మాతా శిశు మరణాలను తగ్గించే లక్ష్యాలుగా అమలవుతున్న జాతీయ ఆరోగ్య మిషన్, ఫ్యామిలీ డాక్టర్ పథకాలను అధికారులు అంకితభావంతో అమలు చేయాలని కోరారు. తద్వారా ఆరోగ్యవంతమైన మానవ సంపదను దేశానికి అందించాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీరు అందించేందుకు పనులు ముమ్మరంగా చేయాలన్నారు. పౌష్టికాహార కార్యక్రమాల ద్వారా మహిళలు, శిశువుల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఎంపి కోరారు. ఈ అంశంలో అదనపు నిధులు కల్పించి మిగిలిన రాష్ట్రాల కంటే మెరుగైన మెనూ మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ్ కౌసల్ యోజనా ద్వారా మహిళలు ఆర్థిక శక్తులుగాను, వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో దాదాపు 30 కోట్ల నిధులతో ఆసుపత్రి భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయని, వీటిని నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రస్తుత వర్షా కాలంలో ప్రబలే వ్యాధులను సమర్థవంతంగా నిర్వహించే కార్యాచరణ క్రింద జిల్లాలో చేపట్టిన ఫీవర్ సర్వే, డెంగ్యూ సర్వే కార్యక్రమాలను విస్తతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా వైద్య, ఆరోగ్య అధికారులను ఆదేశించారు. జగ్గంపేటలో ఖాళీగా ఉన్న స్త్రీ శక్తి భవన్‌లో వృత్తి శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు కోరారు. పిహెచ్‌సిల్లో గర్భిణులకు చేరువలో ప్రసూతి సేవలు అందేలా చూడాలని, పలువురు ఎంపిపిలు కోరారు. ఈ సమావేశంలో జెడ్‌పి చైర్మన్ విపర్తి వేణుగోపాలరావు, సిఇఒ ఎ.రమణారెడ్డి, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్, డిసిహెచ్ఎస్ డాక్టర్ విష్ణువర్ధని, డిఆర్‌డిఎ పీడీ శ్రీరమణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత

గంజాయి, సారాపై నిఘా అవసరం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

గంజాయి, సారాను నిరోధించడంతో పాటు ప్రజలకు సత్వర సేవలందించడంలో అసాంఘిక కార్యక్రమాలు అరికట్టడంలోనూ సిబ్బంది అంకితభావంతో పని చేయాలని ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ ఆదేశించారు. సామర్లకోట పోలీస్ స్టేషన్‌ను, సామర్లకోట రైల్వే స్టేషన్‌ను, సామర్లకోటలోని ముఖ్య కూడళ్లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. తొలుత పోలీసు స్టేషన్ ఆవరణ, పరిసరాలను పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్ కౌంటర్‌ను పరిశీలించి, మహిళా పోలీసులను రిసెప్షనిస్ట్‌గా ఉంచి, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాదగా మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకుని వాటిని చట్ట పరిధిలో పరిష్కరించాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదునూ పరిశీలించి, చెప్పదగిన నేరాలుంటే వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సూచించారు. రాత్రి సమయాల్లో గస్తీ పెంచి, దొంగతనాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి సూచించారు. అవినీతికి తావు లేకుండా ప్రజల సమస్యలను పరిష్కరించేలా విధి నిర్వహణ చేయాలని సూచించారు. ఆయన వెంట సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ చిత్రాడ గోపాలకృష్ణ, తోట సునీత ఉన్నారు.

కార్టూ'నిజం'



అదానీ కేసు, వివేకానంద కేసుల సాగదీతలకన్నా.. మన సీరియల్స్ సాగుడు పెద్ద సాగదీతేం కాదొదినా..!!

అర్హులందరికీ పథకాల అందజేత

అర్హత ఉండి పథకాలను లబ్ధిదారులను గుర్తించి పథకాలు అందజేయడమే జగనన్న సురక్ష యొక్క ముఖ్య ఉద్దేశమని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. శుక్రవారం పలుచోట్ల లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించారు.



ప్రజాశక్తి- యంత్రాంగం

రౌతులపూడి ములగపూడిలో ఎంపిడిఒ గోవిందు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జి.రమణమ్మ, కో ఆప్షన్ సభ్యులు సత్యనారాయణ, అంకంరెడ్డి సతీష్ కుమార్ పాల్గొన్నారు. **గండేపల్లి** ఎన్‌టి.రాజాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు మాట్లాడారు. తహశీల్దారు కెవివి.సత్యనారాయణ, సర్పంచ్ బిక్కిన దేవిదుర్గ, ఉప సర్పంచ్ పరిమి రాజు, పాలచర్ల సత్యనారాయణ, గోపాలపురం సర్పంచ్ పార్థసారథి, ఎంపిడిఒ బిఎస్‌కె.రామన్, పంచాయతీ కార్యదర్శి తరంగణి పాల్గొన్నారు. **పెదపూడి** ఎంపిడిఒ పి.విజయభాస్కర్, తహశీల్దారు టి.సుభాష్ పెదపూడి సచివాలయం-2లో నిర్వహించిన గ్రామ సభలో 795 ధ్రువపత్రాలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ విప్ సమ్మంగి దుర్గాప్రసాద్, పప్పు సింహాచలం, మార్ని వెంకట్రావు, ఇఒపిఆర్‌డి మన్యం శ్రీనివాస్ చౌదరి, తిప్పాన వెంకటరమణ, వ్యవసాయశాఖాధికారి టివిఆర్.మణిదీష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. **తాళ్లరేవు** సచివాలయం-1లో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసిని దేవి అధ్యక్షతన జరిగిన సభలో తహశీల్దారు పోతురాజు, ఇఒపిఆర్‌డి మల్లాడి భైరవమూర్తి, ఎంపిపి రాయుడు సునీత, జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్, ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, రాయుడు గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, ఆకుల వెంకన్న, చిట్టూరి చలపతి, నందికోళ్ల శ్రీమన్నారాయణ, పి.భైరవమూర్తి , బొంతు మోహన్, రామకృష్ణ, పిల్లి పరదేశ్వరరావు పాల్గొన్నారు. **పెద్దాపురం** పట్టణ పరిధిలో 12, 13 వార్డుల సచివాలయాల్లో లబ్ధిదారులకు 11 రకాల పత్రాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు కొట్టు పవన్ కుమార్, త్సలికి సత్య భాస్కరరావు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు గుర్రాల యాకోబు, చింతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** 7వ సచివాలయంలో మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు అధ్యక్షతన మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కష్ణమూర్తి, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు పాల్గొన్నారు. చంద్రంపాలెంలో ఎంపిడిఒ డి శ్రీలలిత అధ్యక్షతన చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, తహశీల్దారు ఎస్.లక్ష్మీనరసకుమారి, పట్టణ జెసిఎస్ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి, నేతల హరిబాబు, వారా పాప, వారా సుధాకర్, రెడ్నం దొరబాబు, చిట్టిమాని శ్రీను, నేతల శ్రీను, రొట్టె అబ్బులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పవన్ కల్యాణ్ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వాలంటీర్లపై పవన్ వ్యాఖ్యలు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. కరోనా కాలంలో వాలంటీర్లు ఎంతో సేవ చేసి ప్రాణాలకు తెగించి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఆడబిడ్డలను అవమానకరంగా మాట్లాడిన పవన్ కళ్యాణ్‌ను అరెస్ట్ చేయాలని మండల పరిషత్ సభ్యులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. తొలుత జరిగిన మండల పరిషత్ సభ్యసభ్య సమావేశంలో మండల అగ్రికల్చర్ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య మాట్లాడుతూ పిఎం కిసాన్ కింద ఇంకా 440 మంది రైతులు పెండింగ్‌లో ఉన్నారని వారందరూ ఇకెవైసి చేయించుకోవాలని తెలిపారు. అదేవిధంగా 170 క్వింటాలు విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్నాయని రైతుల వాటిని వినియోగించుకోవాలని కోరారు. హౌసింగ్ ఎఇ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలో రోడ్లు వేయడానికి ఇంకా నిధులు రావాల్సి ఉందని తెలిపారు. ఐసిడిఎస్ అధికారి ఉష మాట్లాడుతూ ప్రస్తుతం గర్భిణులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అనేక రకాల పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ శ్రీలలిత, వైస్ ఎంపిపిలు పేర్నిడి వెంకట రాయుడు, ములసా శ్రీనివాసు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, ఎఒ సాయిబాబు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్
రూరల్ మండలం నల్లమిల్లి గ్రామానికి చెందిన బద్రి దివ్య రమ్య (20) శుక్రవారం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ వివాదాల వల్ల రమ్య ఆత్మహత్య చేసుకుందని స్థానికులు చెబుతున్నారు. పేరూరు గ్రామానికి చెందిన రమ్యకు రెండేళ్ల క్రితం నల్లమిల్లికి చెందిన బద్రి గంగరాజుతో వివాహం అయ్యింది. వీరికి ఇంతవరకు సంతానం కలగలేదు. సమాచారం తెలుసుకున్న తాలూకా ఎస్ఐ అందే పరదేశి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

చిత్రహింసలు తాళలేక భర్తను హత్య చేసిన భార్య

ప్రజాశక్తి-అయినవిల్లి
మద్యానికి బానిసై చిత్రహింసలు పెడుతున్న భర్తను భరించలేక కడతేర్చిన భార్య ఈ సంఘటన మండలంలోని ఆయనవిల్లిలంక గ్రామంలో చోటు చేసుకుంది ఇసుకపట్ల రామకష్ణ (36) మద్యానికి బానిసై రోజు తాగివచ్చి భార్యతో పాటు తల్లిదండ్రులతో గొడవ పడుతూ కొడుతుండేవాడు. రోజులాగే రాత్రి కూడా గొడవ పడటంతో విసిగిపోయిన భార్య భర్త తలపై చెంబుతో బలంగా మొదడంతో రక్తపు మడుగులో పడి చనిపోయాడు. సిఐ ప్రశాంత్ కుమార్, ఎస్ఐ నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-గండేపల్లి
నీలాద్రిరావుపేటలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసకుంది. అదే గ్రామానికి చెందిన మెట్టేటి చిట్టెమ్మ (75) రోడ్డు దాటుతుండగా రాజమండ్రి వైపు నుండి జగ్గంపేట వైపు వెళ్లే లారీ బలంగా ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా మృతదేహం నుజ్జునుజ్జయ్యింది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వై.గణేష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పెద్దాపురం తరలించినట్లు తెలిపారు

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- రౌతులపూడి
రైతులపూడిలో శుక్రవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. చాకిరేవుపాలెం గ్రామానికి చెందిన సతీష్, ప్రసాద్ యువకులు చెరో బైకుపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొని ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలు పాలైన యువకులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు.

ఆటోను బైకు ఢీకొని నలుగురికి..

ప్రజాశక్తి - తాళ్లరేవు
చొల్లంగి హరిత కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆటోలను బైకు ఢీకొన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒక ప్రైవేట్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బైకుపై వెళుతుండగా ఎదురుగా పశువులు అడ్డు వచ్చాయి. వాటిని తప్పించబోయి ఆటోను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న ఇద్దరు విద్యార్థులు, ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో స్థానికులు, పోలీసులు వారిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

పేకాడుతున్న పలువురి అరెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి
సూరంపాలెం గ్రామం శివారులో పేకాడుతున్న నలుగురిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పేకాట శిబిరంపై సమాచారం అందుకున్న ఎస్ఐ వై.గణేష్ కుమార్ సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,250 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పిఠాపురంలో 'ఇంటింటికీ వర్మ'

ప్రజాశక్తి-పిఠాపురం
టిడిపి ప్రభుత్వ హయాంలోనే పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని మరొక్కసారి తనకు ఎంఎల్ఎగా మరో అవకాశం ఇవ్వాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎంఎల్ఎ వర్మ ప్రజలు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో వర్మ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి శుక్రవారం మన ఇంటికి మన వర్మ కార్యక్రమం చేపట్టారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర కోటగుమ్మం సెంటర్, మార్కెట్ సెంటర్, చర్చి సెంటర్ మీదుగా ఉప్పాడ సెంటర్ వరకు కొనసాగింది.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి-కాకినాడ
ప్రతి విద్యార్థీ ఉత్తమ పౌరుడుగా ఎదగాలని ఇస్రో విశ్రాంత్రి శాస్త్రవేత్త వై.శివప్రసాద్ అన్నారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త వై.శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఉత్తమ పౌరునిగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో గొప్ప శాస్త్రవేత్తగా ఎదగాలన్నారు. ఉన్నత లక్షలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానం గురించి వివరించారు. పాఠశాల హెచ్ఎం ఎంఎస్.సుబ్రహ్మణ్యం, బలరామకృష్ణ, కేసరి శ్రీనివాసరావు, ఎంవిఎస్.రామకృష్ణ, జి.శ్రీనివాస్, సిహెచ్.శ్రీహరిరావు, బి.సంపత్ కుమార్, పి.ధనలక్ష్మి, జి.మేరీ విజయకుమారి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి -కరప
కరప గ్రామం రామకంచి రాజు నగర్ కాలనీలో అంగన్‌వాడీ సెంటర్ 148లో అంగన్వాడి సహాయకురాలు పోస్టుకు ఖాళీ ఏర్పడిందని ఎంపిడిఒ కె.అప్పారావు తెలిపారు. ఎస్‌సి కేటగిరీకి చెందిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఈ దరఖాస్తులను కాకినాడ ఐసిడిఎస్‌లో ఈ నెల 17వ తేదీ లోపు అందజేయాలని తెలిపారు. గొర్రిపూడి, వేములవాడ, కూరాడ గ్రామాల్లో వాలంటీర్ పోస్టులు ఒక్కొక్కటి చెప్పున ఖాళీలు ఉన్నాయని ఆ గ్రామాలలో ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపిడిఒ తెలిపారు. ఈ పోస్టులను ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కరప మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరిస్తామని తెలిపారు.

యానాం వార్తలు


శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు, ఎంఎల్ఎ అశోక్

కో- ఆపరేటివ్ సిబ్బందికి ఎంఎల్ఎ సంఘీభావం

ప్రజాశక్తి -యానాం
నాలుగు రోజులుగా తమకు బకాయి వేతనాలు చెల్లించాలంటూ కో ఆపరేటివ్ స్టోర్స్ సిబ్బంది చేపట్టిన నిరాహార దీక్షకు పలు పార్టీలు, సంఘాల నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఒక నెల జీతం రాకపోతేనే ఇబ్బందులు ఎదుర్కొనే ఈ రోజుల్లో 30 నెలల వేతనాలు అందించకపోవడం బాధాకరమన్నారు. కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. లిక్కర్ స్టోర్స్‌లో రూ.లక్షల అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోపరేటివ్ ప్రెసిడెంట్ సిబ్బంది పట్ల కక్షతో వ్యవహరిస్తూ స్టోర్స్‌ను భ్రష్టు పట్టించారన్నారు. అనంతరం భాజపా నాయకులు కోపరేటివ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారం కోరుతూ పరిపాలనాధికారి మునిస్వామిని కలిసి మాట్లాడారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కార్యకర్తలు దీక్ష శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలిపారు. అనంతరం పండు సిద్ధార్థ కుమార్ డివివి సత్యనారాయణ, హరిచంద్ర, లంకే లోవరాజు, సబ్బతి లోకేష్, ఎం.లోవరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకుడు కనకాల రాజు, ఎన్ఆర్ కాంగ్రెస్ నాయకుడు శామ్యూల్, నక్కల సుబ్బన్న, కనకాల కృష్ణ, కామిశెట్టి కమలాకర్ నాయుడు, వేణుగోపాల్, చెక్కల అరుణ్ కుమార్, బి.నాగేశ్వరరావు, కనకాల నాని, శ్యామ్, ప్రిన్స్ కుమార్, అంజి తదితరులు పాల్గొన్నారు.

శారదాదేవికి సారె అందజేత

ప్రజాశక్తి - యానాం
ఆషాడ మాసం సందర్భంగా స్థానిక గోపాల్ నగర్‌లో ఉన్న ఉన్న శారదా దేవి ఆలయంలో అమ్మవారికి మహిళలు శుక్రవారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పిండి వంటలు చేసి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మహిళలు పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు.

బిసి బాలుర హాస్టల్ పునఃప్రారంభం

ప్రజాశక్తి - యానాం
స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాల సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతీరావు పూలే బిసి బోయ్స్ హాస్టల్‌ను పున్న ప్రారంభిస్తున్నట్టు ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్ మునిస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు యానాంలో ఉన్న 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు కోసం వెల్ఫేర్ ఆఫీసర్ చింతా రామజోగిని సంప్రదించాలన్నారు.

గోదావరి వరదలపై సమీక్ష

ప్రజాశక్తి - యానాం
గోదావరి వరదలపై సమీక్ష సమావేశాన్ని ఆర్ఎఒ మునిస్వామి అన్ని శాఖల అధికారులతో స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆర్ఎఒ మునిస్వామి మాట్లాడుతూ వరదలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, ఆరోగ్య, అగ్నిమాపక, మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు విద్యార్థులు కృషి చేయాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్
విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు లక్ష్య సాధనతో కృషి చేయాలని సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ చెప్పారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన ప్రాజెక్ట్ చేతన, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కెరీర్ డే కార్యక్రమం నిర్వహించారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించడం విద్యార్థులకు ఎంతో గొప్ప సదవకాశమని సిఐ దుర్గాప్రసాద్ చెప్పారు. విద్యార్థులు తొలుత తమ ఇష్టాన్ని, అభిరుచులను గుర్తుంచుకొని వాటి కనుగుణంగా లక్ష్యాన్ని ఏర్పరచు కావాలని, తద్వారా మంచి కెరీర్ ఎంచుకోవాలని తెలిపారు. ప్రయత్నం చేయడంలో అలసత్వం కూడదని, ఆత్మవిశ్వాసంతో అనుకున్న కెరీర్‌లో రాణించాలని పేర్కొన్నారు. సమాజంలో అనేక కెరీర్‌లు ఉన్నాయని, వేటికవే ప్రత్యేకత కలిగి ఉన్నాయన్నారు. స్కూల్ కెరీర్ గైడెన్స్ ఆఫీసర్ జి.గోవిందు కెరీర్‌డే ప్రాముఖ్యత వివరించారు. ప్రతి నెలలో రెండవ మరియు నాల్గవ శుక్రవారం ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విషయం తెలిపారు.విద్యార్థులకు నెలలో రెండుసార్లు స్టడీ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. తోటకూర సాయి రామకృష్ణ, టీచర్లు వి.రాజు, కె.అరుణ, కెవివిసత్యనారాయణ, కె.శ్రీనివాస్, డివిఆర్ఎన్.వల్లి, బి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

లబ్ధిదారులందరికీ టిడ్కో గృహాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పెద్దాపురం
వాలుతిమ్మాపురం రహదారిలో నిర్మించిన టిట్కో గృహాలు లబ్ధిదారులందరికీ వెంటనే అప్పగించాలని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ టిట్కో గృహాలు నేటికీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. గృహాలు అప్పగించిన లబ్ధిదారుల్లో అధిక శాతం మంది టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్నారన్నారు. ఎంతో సంతోషంతో స్వంత గృహాల్లో అడుగుపెట్టిన లబ్ధిదారులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయన్నారు.ఈ గృహాల్లో పూర్తిస్థాయిలో మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయలేదన్నారు. మంచినీటి వాల్వులను ఆపరేట్ చేసే సిబ్బంది కూడా లేరన్నారు. 1700 గృహాలు ఉన్న ఈ కాలనీలో మంచినీటి సదుపాయం ,వీధిలైట్లు కల్పించకుంటే ప్రజలు ఎలా జీవిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ, డి.క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

నాలుగో రోజుకు రైతుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-పిఠాపురం
గోకివాడలో అక్కినీడి వారి చెరువు పుట్టకుంట కాలువపై తొలగించిన షట్టర్లు తిరిగి ఏర్పాటు చేయాలని రైతులు చేస్తున్న రిలే నిరాహారదీక్ష శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో గ్రామ రైతులు వాసిరెడ్డి చిట్టిబాబు, కర్రెడ్ల బాపన్నదొర, విశ్వనాథం సత్తిబాబు, నామా రమేష్, సిరికి సూరిబాబు ఉన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ షట్టర్లు తొలగించడంతో తమ గ్రామంలో పంటలకు నీరందక పంట నష్టపోతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గరగ సత్యానందం, నామా పెద్దిరాజు, నామా సూరిబాబు, కొత్తెం నానాజీ, గరగ శేషుబాబు, కొత్తెం బుజ్జి, కాయల పవన్ పాల్గొన్నారు.

'రవీంద్రభారతి'లో డివైఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్
మండల కేంద్రమైన జగ్గంపేటలో ఉన్న రవీంద్ర భారతి పబ్లిక్ పాఠశాలలో డివిజనల్ విద్యాశాఖ అధికారిని సుభద్ర శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తుకు ఎక్కడ ఆటంకం రాకుండా వేరే పాఠశాలలో చేర్పిస్తామని ఆమె పేర్కొన్నారు. శ్రీ రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ మూసి వేస్తున్నారని, పిల్లల్ని స్కూల్ యాజమాన్యం రావద్దంటున్నారని, వేరే పాఠశాలలో ఎవరు జాయిన్ చేసుకోవడం లేదని, తమ పిల్లల భవిష్యత్ ఏమిటని అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆమె పాఠశాలను సందర్శించారు. 1 నుండి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులను వేరే పాఠశాలలో చేర్పించే విధంగా ఎంఇఒకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. ఆరు నుండి పదవ తరగతి వరకు కూడా ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి టిసిలు ఇచ్చినట్టు తెలిపారు.

కుల, మతాలకతీతంగా సమన్యాయం

కాకినాడ రూరల్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో కుల మతాలకు అతీతంగా అందరికీ సమన్యాయం చేస్తున్నట్టు మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలో శుక్రవారం పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణల ద్వారా సుమారు రూ.23 లక్షల 20 వేల సిఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కరప జెడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు, కరప ఎంపిపి శ్రీలక్ష్మీ సత్తిబాబు, సూర్యరావుపేట సర్పంచ్ సూరాడ చిన్నిరాజు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం
విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలతో విద్యనభ్యసించాలని మండల విద్యాశాఖ అధికారులు సూచించారు. గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గహాన్ని ఎంఇఒ-1 కె.కిరణ్ బాబు,ఎంఇఒ-2 ఎస్.సత్య కష్ణ లు శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా వసతి గహంలోని విద్యార్థినిలకు అందిస్తున్న సదుపాయాలను వార్డెన్ బి.తులసిని వారు అడిగి తెలుసుకున్నారు. విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. సంక్షేమ వసతి గహంలో ఉన్న సదుపాయాలను విద్యార్థినిలు సద్వినియోగం చేసుకొని విద్యలో ఉన్నతులుగా ఎదగాలని అన్నారు.

సాగు వివరాలను రైతులకు తెలియజేయాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం
గ్రామస్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయసహాయకులు రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామం పరిధిలోని రైతులకు,కౌలు రైతులకు సరైన సాగు పద్ధతుల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని వ్యవసాయ సలహా సంఘం ఛైర్మన్ ఇళ్ల సూర్య నారాయణ అన్నారు. కె.గంగవరంలో వ్యవసాయ మండల సమావేశం శుక్రవారం ఆయన అధ్యక్షతన జరిగింది. ఎడిఎ ఎవిఎస్.రంగారావు మాట్లాడుతూ ప్రస్తుత తొలకరి పంటలో భాగంగా అందరూ కూడా ఈనెల జూలై 15 లోపు నారుమడులు వేసుకోవాలని నారుమడులు వేయని వారు జూలై 15 తర్వాత నుంచి నేరుగా వెదజల్లే పద్ధతిలో మాత్రమే పంట వేసుకోవాలన్నారు. ఆగస్టు 15 లోపు వరి నాట్లు కూడా పూర్తి చేయాలని దానికి అనుగుణంగా రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎంపిపి నాగమణి మాట్లాడుతూ వరి వ్యవసాయంతో పాటు ప్రభుత్వం ఉచితంగా అందించే కందులను వరి గట్ల చుట్టూ పెంచుకోవడం వల్ల అదనపు ఆదాయం పొందే దిశగా కూడా రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కందులు కావలసినవారు స్థానిక రైతు భరోసా కేంద్రాల వారిని సంప్రదించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి బలుసు రవి మాట్లాడుతూ చిరుధాన్యాల పెంపకం ద్వారా అదనపు ఆదాయం మరియు తద్వారా వాటిని ఉపయోగించుకోవడం వల్ల మంచి ఆరోగ్యం రెండు కలుగుతాయని వివరించారు కార్యక్రమంలోఅన్ని గ్రామాల ఉద్యాన సహాయకులు రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల బంద్ విజయవంతం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్
రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 22 ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రయివేట్ కళాశాలల అసోసియేషన్ పిలుపుతో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన విజయవంతమైంది. ఎకెఎన్‌యు కాలేజిస్ అసోసియేషన్ అధ్యక్షులు కె.నరసింహ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 22 రద్దు చేయాలన్నారు. యూనివర్సిటీ పరిధిలో చాలా కళాశాలలను అనేక కారణాలు చూపించి మూసివేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. ప్రభుత్వానికి చెల్లించే ఫీజులు పెంచుతూ, కళాశాలకు చెల్లించే ఫీజులు తగ్గిస్తూ రావటాన్నీ తపప్పుబట్టారు. కార్యక్రమంలో యాలంగి వరప్రసాద్, కరాటం ప్రవీణ్, సూర్యకుమారి, కె.మనోహర్, బి.శ్రీనివాస్, జాన్‌పాల్, నాగరాజు, కె.వెంకటేష్, సంసోన్ తదితరులు ప్లకార్డులతో నిరసన తెలియజేశారు.

బడి బయట పిల్లలు పాఠశాల్లో చేరిక

ప్రజాశక్తి-మండపేట
స్థానిక వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో బడి బయట పిల్లలను గుర్తించి వారిని తిరిగి రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి పి.షాలెంరాజు ఆధ్వర్యంలో పాఠశాల్లో శుక్రవారం చేర్పించారు. ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్లి చదువుకోవాలని ప్రభుత్వం పేద విద్యార్థుల కొరకు పథకాలు అమలు చేస్తున్నందున అందరూ వాటిని వినియోగించుకుని చదువుకుని విద్యావంతులు కావాలన్నారు. ఈ సందర్భంగా బడి బయట పిల్లలు రాసూరి మేరి, రాసూరి గోగులమ్మలను తిరిగి పాఠశాల్లో చేర్పించారు. బడి బయట పిల్లలను గుర్తించి అటువంటివారిని విద్యా హక్కు చట్టం ద్వారా పాఠశాల్లో అడ్మిషన్లు ఇవ్వాలని సూచించారు. హెచ్ఎం ఆర్.నాగకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సుధాకర్ పుట్టినరోజు

ప్రజాశక్తి-అంబాజీపేట
ముక్కామల టిడిపి గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి సుధాకర్ పుట్టినరోజు వేడుకను శుక్రవారం టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. సుధాకర్‌ను పూలదండలు వేసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబిసి నాయకులు యడ్లపల్లి తుక్కియ్య, పెట్టా కృష్ణ,కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-మామిడికుదురు
పగటిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ లో ఉన్న చెట్లు కొమ్మలు తొలగింపు, మైనర్ రిపేర్ల నిమిత్తం శనివారం సరఫరా నిలివివేస్తామని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. మగటపల్లి, మామిడికుదురు, ఈదరాడ, కొమరాడ, లూటుకుర్రు, మాకనపాలెం గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని అధికారులు తెలిపారు.


పాలాభిషేకం చేస్తున్న జనసేన నాయకులు

కిర్లంపూడిలో పవన్‌కు పాలాభిషేకం

కిర్లంపూడి : కిర్లంపూడిలో జనసేన పార్టీ నాయకులు పవన్ కళ్యాణ్ ఫోటోకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఉలిసి అయిరాజు మాట్లాడారు. పవన్ కల్యాణ్ ఏమన్నారో పూర్తిగా చూడాలని, ఆయన వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బుదిరెడ్డి శ్రీనివాస్, డేగల విజయ్, సత్యంశెట్టి వీర గణేష్, ఎంపిటిసి గోకేడ రాజ, ఎలుబండి శివ, పాలిశెట్టి సతీష్ ఉన్నారు.